తక్కువ ధరకే

ఐఫోన్ అంటూ మెసేజ్..

● సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ● రూ.6 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఇన్‌స్టాగ్రామ్‌లో ఐఫోన్ తక్కువ ధరకనే మెసేజ్ రావడంతో కొనడానికి ప్రయత్నించే క్రమంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.ఆరు లక్షల 2 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ రాఘవేంద్ర కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ 25వ తేదీన ఇన్‌స్టాగామ్‌లో ఐఫోన్ 13 వేలకు వస్తుందని వచ్చిన మెసేజ్‌ను చూసి అపరిచిత వ్యక్తిని సంప్రదించారు.దీంతో ఆ వ్యక్తి ఓ లింకు పంపగా తన వివరాలు నమోదు చేశాడు.అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో ఐదు దఫాలుగా తన ఖాతాలో ఉన్న రూ. ఆరు లక్షల రెండు వేలు పోగొట్టుకున్నాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు..

◆ రెండు లక్షల 71వేలు పోగొట్టుకున్న గృహిణి

లోన్ ఇస్తామంటూ వచ్చిన ఫోన్‌కాల్‌కు స్పందించి, ఓ గృహిణి రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ కు చెందిన ఓ గృహిణికి నవంబర్ 6 వ తేదీన రూ.లక్ష రూపాయలు లోన్ ఇస్తామంటూ ఫోన్ కాల్ వచ్చింది.దీంతో బాధితురాలు అపరిచిత వ్యక్తి పంపిన లింకులో తన వివరాలు నమోదు చేసింది. నమోదు చేసిన కొద్దిసేపటికి తన ఖాతాలో ఉన్న రూ.రెండు లక్షల 71 వేలు పోగొట్టుకుంది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



కూకట్‌పల్లిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని పురస్కరించుకొని మంగళవారం కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ దివంగత నేత వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో గూడెపు నాగరాజు, కుమార్‌యాదవ్, రాచమల్లు శేఖరగౌడ్, కమ్మరి గణేష్‌చారి, రాహుల్ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య ఛేదనలో ఆరోగ్యం ఎంతో ముఖ్యం

'ఎస్కీ' డైరెక్టర్
డాక్టర్ జి రామేశ్వరరావు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంతోపాటు సమాజానికి సేవ చేయగలరని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారని, దీంతో బీపీ, షుగర్‌లతోపాటు గుండె సంబంధ సమస్యలు వస్తున్నాయన్నారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎముక సాంద్రత పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డిలతోపాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.



ఎస్కీలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామేశ్వరరావు

కృష్ణారావుకు అభినందనల వెల్లువ



కృష్ణారావుతో మహిళా నాయకులు



కూకట్‌పల్లి నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా మాధవరం కృష్ణారావు ఘనవిజయం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పార్టీ ఎస్సీ విభాగ అధ్యక్షుడు బొట్టు విష్ణు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాజ్, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వార్డు మెంబర్ మహమ్మద్ ఖాదీర్, అక్బర్ అలీ, మహిళా నాయకులు గొంగిడి సంతోషి, శశికళ, డా.అంబేద్కర్ సంఘం దయార్‌గూడ సభ్యులు కలిసిన వారిలో ఉన్నారు. – కూకట్‌పల్లి





మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన బొట్టు విష్ణు, ఏజాజ్, ఖదీర్



శుభాకాంక్షలు తెలుపుతున్న ముదిరాజ్, ముస్లిం, మహిళా నాయకులు











సన్మానం



అజయ్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న కనకరాజుయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన మామిండ్ల అజయ్‌కుమార్ యాదవ్‌ను అంజయ్యనగర్ వాసులు శాలువా కప్పి సన్మానించారు. ప్రస్తుతం కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న అజయ్‌కుమార్ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. మంగళవారం అంజయ్యనగర్ వాసులు కనకరాజు యాదవ్, వేంకటేశ్వర్లు, బెల్లం ఐలయ్య, తదితరులు అభినందనలు తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోచెర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, సీనియర్ నాయకుడు సంజీవరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆయనతో కేక్ కట్‌చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సర్వే సత్యనారాయణ, సంజీవరావు

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఇలినాయ్ యూనివర్సిటీ
ప్రొ.డాక్టర్. విజయ్ ఎల్దండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇలినాయ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ ఎల్దండి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చాలా మంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం లేదని, మంచి ఆహారంతో పాటు నిత్యం ఒక గంట సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలని కోరారు. అనంతరం ఆస్క ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ బాలబోయిన సుదర్శన్ మాట్లాడుతూ సంస్థ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం, వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. బుధవారం అయన మనవరాలు కౌసాంభీ మొదటి పుట్టినరోజు సందర్భంగా తెల్లాపూర్‌లో ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ కొల్లూరి భరత్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు సతీష్‌గౌడ్, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ ఎల్దండి

ఏకపక్ష నిర్ణయాలతోనే బీఆర్ఎస్ ఓటమి

లిబర్టీ: బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్‌రావు ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వం వైఖరి కారణంగా ఆ పార్టీ ఓటమి పాలైందని లోక్ దళ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పీపీ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ మితిమీరిన ఆత్మవిశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మరించినందునే 39 స్థానాలకు పరిమితమయ్యారని స్పష్టం చేశారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు.

హ్యాట్రిక్ అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

కూకట్‌పల్లి బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు... కృషి చేసిన కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవే పరమావధిగా భావించి 35 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉంటూ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మాధవరం కృష్ణారావుకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని యోధుడిగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు సేవలు నిరంతరం కొసాగుతాయన్నారు.

ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

కూకట్‌పల్లి బీఎస్పీ అభ్యర్థి సంజీవరావు



కూకట్‌పల్లి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఎస్పీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి సంజీవరావు పేర్కొన్నారు. ఓటర్లు తనపై చూపిన ఆదరణతో భవిష్యత్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు మరింత సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తాం



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏకాంత్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఏకాంత్‌గౌడ్ అన్నారు. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అవినీతికి, ప్రభుత్వ భూముల, చెరువు ఆక్రమణలకు పాల్పడిన వారికి, సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మనూ భోపాల్ క్యాంపస్ ప్రారంభం

రాయదుర్గం: భవిష్యత్తులో మనూను శాటిలైట్ క్యాంపస్‌గా మార్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తెలిపారు. మంగళవారం భోపాల్ క్యాంపస్‌ను వీసీ ప్రారంభించారు.



క్యాంపస్ ప్రారంభోత్సవంలో వీసీ ఐనుల్ హసన్

అనంతరం ఆయన మాట్లాడుతూ 6.44 ఎకరాల భూమిలో విస్తరించి ఉన్న భోపాల్ క్యాంపస్ ఇప్పుడు 'మనూ' కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(సీటీఈ),'మనూ' ప్రాంతీయ కేంద్రాలకు నిలయంగా ఉందన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

లిబర్టీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుల గణనపై పార్లమెంటులో ప్రకటించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే కుల గణనపై స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కుల గణనపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రక్రియను వేగవంతం చేసే పనిలో ఉన్నారన్నారు. అదే తరహాలోనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కరించని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో సాయి, సుభాష్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం

లిబర్టీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6న అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్ తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ సమావేశ మందిరంలో 38వ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ విశ్వ వైతాళికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అంశంపై డాక్టర్ ఘంటా చక్రపాణి ఉపన్యాసం చేస్తారన్నారు. 37 ఏళ్లుగా స్మారక ఉపన్యాస పరంపర కొనసాగుతుందన్నారు. మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, దళిత బహుజనలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అరెకపూడి గాంధీని కలిసిన నేతలు



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా అరెకపూడి గాంధీ హ్యాట్రిక్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, వాసు, తదితరులు ఉన్నారు.

భర్తపై అలిగి భార్య ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: తమ స్వగ్రామం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్ళిపోదామని భార్య భర్తను అడగడంతో కొంత నగదు సంపాదించుకున్న తర్వాత వెళ్దాం అని చెప్పి కూలి పనికి వెళ్లిపోగా అలిగి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లా.. సారాయిపల్లి గ్రామానికి చెందిన దీపక్ పటేల్ భార్య సోనియా యాదవ్‌తో కలిసి ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామంలో ఉంటూ మేస్త్రి వద్ద పని చేస్తున్నాడు.అయితే సోనియా యాదవ్ ఇక్కడ ఉండడం ఇష్టం లేదని, స్వగ్రామానికి వెళ్ళిపోదాం అని మంగళవారం అడగడంతో భర్త కొంత నగదు సంపాదించుకున్న తర్వాత వెళ్దాం అని చెప్పి పనికి వెళ్ళిపోయాడు. దీంతో అలిగిన సోనియా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.





మహా పడిపూజలో భారీ ఎత్తున పాల్గొన్న స్వాములు, భిక్ష నిర్వహిస్తున్న పడిపూజ నిర్వాహకులు

స్వామియే శరణం అయ్యప్ప

● హస్మత్‌పేట చెరువుకట్టపై మహా పడిపూజ ● అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ప్రాంగణం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చెరువు కట్టపై కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు కట్ట పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మల్లికార్జునశాస్త్రీ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు మక్కాల నర్సింగ్‌రావు, మక్కాల సత్యనారాయణ మహాపడి పూజను నిర్వహించారు. అయ్యప్పస్వాములు పడిపూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రూ.25లక్షలతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మండపం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి పాల్గొన్నారు.



పదునెట్టంబడికి దీపాలు వెలుగిస్తున్న మక్కాల నర్సింగ్‌రావు, మక్కాల సత్యనారాయణ



మాతృమూర్తిని సన్మానిస్తున్న మక్కాల నర్సింగ్‌రావు స్వామి



మహాపడి పూజలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను సన్మానిస్తున్న మక్కాల నర్సింగ్‌రావు స్వామి

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: భక్తితోనే ముక్తి లభిస్తుందని శ్రీ సాయి విక్రమ్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జి.మాణిక్‌రెడ్డి పేర్కొన్నారు. మోతీనగర్ ప్రధాన రోడ్‌లోని ఆలయంలో రెండు రోజుల నుంచి ఆలయ పదో వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం సాయినాథుడికి విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృతాలతో అభిషేకం, లక్ష్మీగణపతి, ఫల, పుష్ప, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విక్రమ్‌రెడ్డి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ అధినేత దామోదర్‌రావు, ఫౌండేషన్ సభ్యులు శాలిని, గౌరీ, గోవర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కమ్మర్ పటేల్ పాల్గొన్నారు.



పాల్గొన్న ఆలయ చైర్మన్ మాణిక్‌రెడ్డి

అయ్యప్ప స్వాములకు అన్నదానం

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్ కట్టమైసమ్మ దేవాలయంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్‌రెడ్డి గురుస్వామి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అయ్యప్పస్వాముల అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అయ్యప్ప స్వాములతో భిక్ష స్వీకరించారు.



పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

హరిహర క్షేత్రంలో కార్తీకమాస పూజలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు కృష్ణసూచి సమక్షంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కాశీ విశాలాక్షి అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.



హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు